క్లుప్తంగా

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.19.14 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు.. పర్యవేక్షిస్తున్న అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల ఆధ్వర్యంలో హుండీల ఆదాయం లెక్కించారు. అమ్మవారి దర్శనాలకు సంబంధించి 60 రోజులకు గాను రూ.19,14,187 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రీ దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్‌కు ఘన నివాళి



దీన్‌దయాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మల్కాపురం: జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. 59వ వార్డు పరిధి శాంతిగిరి కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ కొక్కిలగడ్డ విజయబాబు పాల్గొని దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దీనదయాల్ ఏకాత్మత మానవతా సిద్ధాంతాన్ని దార్శనిక దృష్టితో ఆవిష్కరించారన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలని పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ సిటీ నాయకుడు పాలమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం



కేంద్రమంత్రి రూపాలకు స్వాగతం పలుకుతున్న జీవీఎల్ నరసింహారావు తదితరులు

గోపాలపట్నం: కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలకు విశాఖ విమానాశ్రయంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ ప్రధాన కార్యదర్శి దానేష్, తదితరులు స్వాగతం పలికారు. నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు ఆయన ఢిల్లీకి బయలు దేరారు.

కాలుష్య నిర్మూలన అందరి బాధ్యత



జీవీఎంసీకి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు కోసం బస్టాప్‌లో వేచి ఉన్న మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలు విన్నారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మేయర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



రామకృష్ణ నగర్ క్రాస్ రోడ్ వద్ద ఇరుకుగా ఉన్న రహదారి



ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేట్‌కు సమీపంలో గతంలో వేసిన డబుల్ రోడ్

ఎన్ఏడీ-గోపాలపట్నం రోడ్డుకు మహర్దశ



బాజీ జంక్షన్‌లో ప్రస్తుత రహదారి

- 80 అడుగుల మేర విస్తరణకు సన్నాహాలు
- ఎన్ఎస్‌టీఎల్ పక్క నుంచి సింహాచలం రోడ్డుకు అనుసంధానం
- మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సర్వే నిర్వహిస్తున్న జీవీఎంసీ అధికారులు
- తొలగనున్న ట్రాఫిక్ ఇబ్బందులు
- హైవే నుంచి సింహాచలం వెళ్లే భక్తులకు ఎంతో సౌలభ్యం

విశాఖ విద్య: ఎన్ఏడీ కూడలి దరి ఎన్ఎస్‌టీఎల్ నుంచి గోపాలపట్నం వెళ్లే వారి కష్టాలు త్వరలో తీరనున్నాయి. ఇరుకు రోడ్డులో రాక పోకలకు పడుతున్న ఇబ్బందులకు చెక్ పడనుంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయి. ఈ రోడ్డును 80 అడుగల రహదారిగా విస్తరించడానికి అడుగులు పడుతున్నాయి. మాస్టర్ ప్లాన్ అమల్లో భాగంగా విశాఖ నగర పాలక సంస్థ అధికారులు రహదారి విస్తరణ పనులకు కసరత్తు ప్రారంభించారు.

2.5 కిలో మీటర్ల మేర విస్తరణకు ప్రణాళిక

బీఆర్‌టీఎస్ రోడ్‌కు ప్రత్యామ్నాయంగా ఎన్ఎస్‌టీఎల్ గోడ పక్క నుంచి సుసర్ల కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్ మీదగా కుమారికల్యాణ మండపం వద్ద సింహాచలం రోడ్‌కు అనుసంధానం చేసేలా రహదారి పనులు చేట్టేందుకు జీవీఎంసీ అధికారులు ఉపక్రమించారు.సుమారు 2.5 కిలో మీటర్ల మేర రహదారి అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా కాలనీల్లోని సచివాలయ సిబ్బందితో కలసి జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సర్వే చేస్తున్నారు.

ఏ ఒక్కరికీ నష్టం లేకుండా..

80 అడుగుల మేర రహదారి విస్తరణతో ఏ ఒక్కరికీ నష్టం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. భవిష్యత్ తరాల కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని, దాన్ని దృష్టిలో పెట్టుకునే ముందుకెళ్లాలని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్, ఏపీఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అధికారులకు సూచించారు. ఆయాకాలనీ వాసుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. దీంతో జీవీఎంసీ అధికారులు సర్వేపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఎంత మేర స్థలం అవసరం ఉంటుందనే దానిపై పక్కాగా లెక్క తీస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఖాళీ స్థలం ఎంత ఉంది... నివాస గృహాలు ఎంత మేర తొలగించాలి అనే దానిపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ 8వ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి జయరామ్ తమ సిబ్బందితో సర్వేలో నిమగ్నమయ్యారు. రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లను తొలగించాల్సి వస్తే, యజమానులు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తొలగనున్న ట్రాఫిక్ కష్టాలు

ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వరకు గల బీఆర్‌టీఎస్ రోడ్‌పై వాహనాల రద్దీతో ప్రస్తుతం తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా 80 అడుగులు రోడ్డు విస్తరిస్తున్నందున ఎన్ఏడీ నుంచి సింహాచలం వరకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ప్రతీ ఏటా నిర్వహించే సింహగిరి ప్రదక్షిణ సమయంలో ఈ రహదారిని పూర్తిగా వినియోగించుకోవచ్చు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు టీడీపీ కుయుక్తులు

రహదారుల అభివృద్ధితోనే దానికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలు పురోభివృద్ధి చెందుతాయి. భవిష్యత్ తరాల అవసరాల మేరకు రహదారుల విస్తరణ పనులు చేపట్టాలనే ఎవరైనా కోరుకుంటారు. ఇళ్లు తొలగించాల్సి వస్తే నష్టపోయిన వారికి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేయడంలో తప్పులేదు. కానీ ఇందుకు విరుద్ధంగా రహదారి పనులకు ఆదిలోనే అడ్డుపడుతూ టీడీపీ నాయకులు తమ రాజకీయ ప్రాభల్యం కోసం పాకులాడుతుండటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ప్రాధాన్యత కలిగిన రహదారి వద్దనే రీతిలో ప్రజలను మభ్యపెడుతూ టీడీపీ నాయకులు ఆటంకాలు సృష్టిస్తుండడంపై ఆ ప్రాంత వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్తు తరాల కోసం విస్తరణ



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 80 అడుగుల రహదారి విస్తరణ కోసం సర్వే నిర్వహిస్తున్నాం. మాస్టర్ ప్లాన్ అమల్లో భాగంగానే రహదారి అభివృద్ధి చేయనున్నాం. సర్వే పూర్తి చేసి సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి. ఈ విషయంలో ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది భవిష్యత్ అవసరాల కోసమేనని అర్థం చేసుకోవాలి.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, 8వ జోన్

అందరికీ ఆమోదయోగ్యంగా రహదారి విస్తరణ

పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆనంద్ కుమార్



కాలనీ వాసులతో ఆడారి ఆనంద్ కుమార్

విశాఖ విద్య: అందరి ఆమోదంతోనే 80 అడుగుల రహదారి విస్తరణ పనులు చేపడతామని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 90 వార్డు బాజీ జంక్షన్ నుంచి కుమారి కల్యాణ మండపం వరకు రహదారి విస్తరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో లక్ష్మి నగర్ నివాసితులు 90 వార్డు పార్టీ సీనియర్ నాయకుడు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో సోమవారం ఆడారి ఆనంద్ కుమార్‌ను కలిశారు. రహదారి విస్తరణలో భాగంగా తమ ఇళ్లకు నష్టం కలుగకుండా చూడాలని వారు ఆడారి ఆనంద్ కుమార్‌ను కోరారు. రహదారి కోసం ఇళ్లు తొలగిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆడారి ఆనంద్ కుమార్ స్పందిస్తూ రహదారి నిర్మాణం వల్ల ఎవరికీ ఎటువంటి నష్టం కలుగని రీతిలోనే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో అధికారులతో మాట్లాడతానన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో ప్రజాభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఆందోళన అవసరం లేదన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జెడ్సీ మల్లయ్యనాయుడు

సింహాచలం: జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెడ్సీ మల్లయ్యనాయుడుకు వినతులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మల్లయ్యనాయుడు తెలిపారు. వచ్చిన వినతులను ఆయా విభాగాల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

- జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో పార్క్‌ని అభివృద్ధి చేయాలని కాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మురళీబాబు కోరారు.అలాగే కాలనీలో రోడ్ల సమస్య ఉందని పేర్కొన్నారు.
- వెంకటాపురంలోని కమ్యూనిటీహాలు అభివృద్ధి చేయాలని సీతారామ గ్రామ అభివృద్ధి సంఘం ప్రతినిధి పి.అప్పలసూరి వినతిపత్రం అందజేశారు.
- గోపాలపట్నం దరి కొత్తపాలెం సంతోష్‌నగర్ కాలనీలో కాలువలు శుభ్రం చేయాలని, పందులు, కుక్కలు సమస్య ఉందని సంతోష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు.
- ఆర్.ఆర్.వెంకటాపురంలో వీధిలైట్(పోల్ నెంబర్ 42బైబిబై3) సమస్యను పరిష్కరించాలని వేపగుంటకు చెందిన అప్పారావు ఫిర్యాదు చేశారు.
- పాతగోపాలపట్నంలోని అప్పలనర్సయ్య కాలనీలో అక్రమ నిర్మాణం జరుగుతోందని అప్పలనర్సయ్య కాలనీకి చెందిన జి.అప్పలకొండ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



గోపాలపట్నం హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు రహదారి నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వాడకం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. ఎక్కువ శాతం హెల్మెట్ లేకపోవడం వల్ల, క్లిప్ పెట్టకపోవడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాలు కోల్పోయారని వివరించారు. కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. రహదారిలో ప్రయాణికులు ఫుట్‌పాత్‌లపైనే నడవాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులే శిక్షిస్తారని వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుని కుటుంబానికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం సచివాలయ పరిధిలో ఉంటున్న మాణిక్యం వెంకటేష్ (39) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో భార్య మాణిక్యం సరస్వతికి వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సోమవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మిగిలిన రూ.4.90 లక్షల నగదు మృతుని నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ బీమా ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎస్. సత్యనారాయణ, మహిళా పోలీస్ సునీత, వీఆర్వో మౌనిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమృత జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

నేటి నుంచి దేవీపురం క్షేత్రంలో ప్రత్యేక పూజలు



దేవీపురంలోని శ్రీచక్రాలయం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో అమృత జయంతి ఉత్సవాలను మంగళవారం నిర్వహించేందుకు శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ తెలిపారు. అమృతానంద సరస్వతి జయంతిని పురస్కరించుకొని పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. గురూజీకి ఇష్టమైన మహిళా సాధికారత దిశగా మరోఅడుగు ముందుకువేసి కన్యా వేద గురుకులం ప్రారంభించి ముందుకు తీసుకువెళ్లాలని గురుమాత అన్నపూర్ణమ్మ నిశ్చయించారని చెప్పారు. 10 ఏళ్ల బాలికలు 10 నుంచి 15 మందిని తీసుకుని ఐదేళ్ల పాటు స్మార్త విద్య,శ్రీ విద్యలతో పాటు 4 భాషల(తెలుగు,ఇంగ్లిష్,హిందీ,సంస్కృతం)తో పాటు సైన్స్,సోషల్,మ్యాథ్స్, కంప్యూటర్ విద్య కూడా నేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఇది వారికి మంచి ఉపాధి అవకాశాలతో పాటు అపార జ్ఞానం,నాయకత్వ లక్షణాలు కలిగిస్తుందన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



అమ్మవారికి పారామాత్మిక హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



పవిత్రోత్సవాల్లో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి విష్వక్సేన, పుణ్యాహవచన, పంచవ్యారాధన, పంచాగవ్యాప్రాశన, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్టాపన, ప్రధాన హోమాలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుంచి అగ్నిధ్యానం, ప్రధాన హోమాలు, పంచకుంభ ఆరాధన, పవిత్ర అభిమన్రణ, పారామాత్మిక హోమం, చతుర్వేద పారాయణం తదితర పూజల చేశారు. పూజా కార్యక్రమాలన్నీ దేవస్థాన వేద పండితులు, అర్చకుల పర్యవేక్షణలో పెదపూడి రఘురామ్(విజయవాడ) నిర్వహించారు.

నేడు అంతరాలయ దర్శనాలు రద్దు

పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు అంతరాలయ దర్శనాలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆ సమయంలో నిర్వహించే పంచామృతాభిషేకం నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని బయట నుంచే దర్శించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు సత్యరూపవాణి, వి.మారుతీప్రసాద్, సుబ్రహ్మణ్యం, సహాయ ఈవో కె.రాజేంద్రకుమార్, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న సీఐ జి.డి.బాబు



కాకరలోవలో అన్నసమారాధన చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

మల్కాపురం: వినాయక నవరాత్రి పూజా మహోత్సవాలు పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా జరుగుతున్నాయి. ప్రకాష్‌నగర్ వద్ద స్థానిక యువత ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుడిని మల్కాపురం సీఐ జి.డి.బాబు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు సీఐ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

- జీవీఎంసీ 58వ వార్డు ములగాడ వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు. అన్న సమారాధనను ప్రారంభించారు.
- 60వ వార్డు ఇందిరాకాలనీ వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో ఆ ప్రాంత వైఎస్సార్‌సీపీ నాయకులు అంగ రామ్‌ప్రసాద్, ఆడారి హరీష్, పూండి మల్లేశ్వరరావు పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.



పిలకవానిపాలెం వద్ద మండపంలో అన్న సమారాధన

40, 62వ వార్డుల్లో అన్నసమారాధనలు

సింధియా: జీవీఎంసీ 40వ యారాడ బస్‌స్టాప్ సమీపంలో దుర్గాదేవి ఆటో స్టాండ్ యూత్, కాకరలోవ బొబ్బిలివీధి హనుమాన్ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన అన్నసమారాధనను మల్కాపురం సీఐ దేముడు బాబు, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, గంట వర్మ, వరపల మహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 62వ వార్డు ప్రకాషనగర్‌లో వీఎస్‌టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని సోమవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దర్శించుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, ఆడారి నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రనగర్‌లో అన్నదానం

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ రజకుల కాలనీలో వినాయక నవరాత్రుల్లో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆడారి శ్రీనివాసరావు, నారిపిన్ని చిన్ని, సరోజిని, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



62వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



ఇందిరాకాలనీ వద్ద జరిగిన అన్నదానంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు గోపాలకృష్ణ, పైడిరాజు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సింహాచలం: ఈపీడీసీఎస్ పెందుర్తి సబ్ డివిజన్‌కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి, వినియోగదారుల ఫోరం చైర్మన్ సత్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

విశేషంగా అప్పన్న ఏకాదశి తిరువీధి



తిరువీధిలో అప్పన్నను దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని సోమవారం సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాదస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకిలో అధిష్టంపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవస్థానం ఈఈ రాంబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ పార్టీల ఐక్యతకు బర్ధన్ కృషి



ఏబీ బర్ధన్‌కు నివాళులు అర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు

అల్లిపురం: దివంగత సీపీఐ జాతీయ కార్యదర్శి ఏబీ బర్ధన్ శత జయంతి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బర్ధన్ చిత్ర పటానికి ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీల ఐక్యతకు బర్ధన్ విశేష కృషి చేశారన్నారు. ఈ శతజయంతి వేడుకలు ఏడాది పొడవునా నిర్వహిస్తామన్నారు. సభలు, సదస్సులు, చర్చాగోష్టి, తదితర కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఏబీ బర్ధన్ కార్మిక సంఘాల బలోపేతానికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జీఎస్‌జే అచ్యుతరావు, ఎం.మన్మథరావు, సమితి సభ్యులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.